ప్రజాశక్తి
మంగళవారం 22 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం

జూన్ 1, 2, 3 తేదీల్లో
ఇప్పలపోలమ్మ, ఎర్ర కంచమ్మ పండగ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

జూన్ 1, 2, 3 తేదీల్లో పార్వతీపురం గ్రామ దేవత ఇప్పలపోలమ్మ, జగన్నాథపురం గ్రామదేవత ఎర్రకంచమ్మ పండగను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులతో పాటు పట్టణ ప్రజలు నిర్ణయించారు. సోమవారం పార్వతీపురంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న పద్మశ్రీ థియేటర్ పక్కన ఉన్న గుడిలో ఇప్పలపోలమ్మ అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పట్టణ ప్రముఖులు, రైతులు, వ్యాపారులు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి అమ్మవారిని తీసుకొని పట్టణంలో నాయుడు వీధిలో ఉన్న ఆలయానికి బాణసంచా, విద్యుత్ అలంకరణ, మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో తోడ్కొని వచ్చారు. ప్రజలు దర్శించుకునేందుకు అమ్మవారి ఘటాలు పట్టణంలోని 30 వార్డులలో తిరుగుతూ ఉంటాయి.

కదంతొక్కిన పేదలు

జిల్లాలో నెలకొన్న భూ సమస్యలపైనా.. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, రెవెన్యూ అధికారుల దౌర్జన్యాలపైనా పేదలు, నిర్వాసితులు కదం తొక్కారు. జిల్లాలో అనేక రకాల చెరువులు, గెడ్డలు, పోరంబోకు స్థలాలు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోకుండా పేదలు, నిర్వాసితుల భూములపై ఎమ్మెల్యే, అధికార యంత్రాంగం దౌర్జన్యం చేయడంపై ధ్వజమెత్తారు. పేదల భూములు పేదలకే దక్కాలని, పెద్దలకు కాదని, పేదల భూముల జోలికొస్తే ఊరుకోబోమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసిత సంఘం నాయకులు హెచ్చరించారు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ఒత్తిడికి తలొగ్గి నిర్వాసితుల పట్టా స్థలాలపై దాడి చేసిన తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని, నిర్వాసితులపై పెట్టిన 107కేసులను ఎత్తివేయాలని, గిరిజనులు, దళితులు, పేదలు తరతరాలుగా సాగుచేస్తున్న బంజరు భూములకు డి-పట్టాలివ్వాలని, అన్యాక్రాంతమైన డి-పట్టా భూములను తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- ఎమ్మెల్యే, తహశీల్దార్ దౌర్జన్యాలపై ధ్వజం
- పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ, ధర్నా
- బంటువానివలస స్థలం కూల్చివేతపై విచారణ చేసి, చర్యలు చేపడతాం : జాయింట్ కలెక్టర్ శోబిక
- జెసి హామీతో శాంతించిన పేదలు, నిర్వాసితులు
- మే 10 లోపు భూ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం : వ్యకాస

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేదలు, నిర్వాసితులు

జాయింట్ కలెక్టర్ శోబికకు సమస్యను వివరిస్తున్న వ్యకాస, నిర్వాసిత సంఘం నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జిల్లాలో పేదలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నాచేశారు. పేదల భూములపై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర దౌర్జన్యాలను ఖండిస్తూ నినదించారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలకు న్యాయం చేస్తామని ఓట్లడడిగి గెలిచి నేడు భూస్వాములకు, కార్పొరేట్లకు న్యాయం చేకూర్చడమే పనిగా పెట్టుకున్న స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తీరు మార్చుకోవాలని, లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎమ్మెల్యే అక్రమ పనులకు అధికారులు తల్లొగ్గి పనిచేయడం దుర్మార్గమని, అటువంటి నీచపు పనులకు అధికారుల దూరంగా ఉండాలని హితవు పలికారు.

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో భూములు, చెరువులు, గెడ్డలు పోరంబోకు స్థలాలు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోకుండా పేదల భూములపై ఇంతటి దౌర్జన్యాలకు పాల్పడుతుండడం అన్యాయమని మండిపడ్డారు. వరహాలుగడ్డ, దేవుని బంద తదితర గెడ్డలను ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలను నిర్మిస్తున్నా స్థానిక ఎమ్మార్వో, కలెక్టర్ ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే ప్రజా ప్రతినిధి ఈఎమ్మెల్యే తప్ప ప్రజలకు మేలు చేకూర్చే వ్యక్తి కాదని అన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ అధికార ఎమ్మెల్యే, తహశీల్దారు, కలెక్టర్ పేదల భూములు స్వాధీనం చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని, ఇప్పటికే రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అధికారులు అనేక దుర్మార్గమైన పనులకు పూనుకుంటున్నారని అన్నారు. పట్టణంలో దేవుని బంధ ఆక్రమణకు స్థానిక ఎమ్మార్వో సరిహద్దులు తేల్చినప్పటికీ ఎందుకు వాటిని మధ్యలోనే విడిచి పెట్టారని ప్రశ్నించారు. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో ప్రజల ఆగ్రహానికి కురికాక తప్పదని హెచ్చరించారు. నిర్వాసితుల సంఘం జిల్లా కార్యదర్శి బంటుదాసు మాట్లాడుతూ తోటపల్లి నిర్వాసితుల పోరాటంలో నాటి ప్రభుత్వం నిర్వాసితులను ఆదుకునేందుకు భూములిచ్చిందని, నాటి అధికారుల రాజ్యముద్రతో పొందిన భూపట్టాలు ఉన్నప్పటికీ నేటి ఎమ్మెల్యేలు వాటిని తారుమారు చేసి స్వాధీనం చేసుకునే పన్నాగాలు పన్నుతున్నారని అన్నారు. అటువంటి చర్యలను సహించేది లేదని, రాజకీయ నాయకులు, అధికారులు ఎంతటి దౌర్జన్యాలకు ఒడిగట్టినా భూములను విడిచి పెట్టే ప్రసక్తే లేదని అన్నారు. మే 10వ తేదీ లోపు జిల్లాలో ఉన్న భూ భూ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతానని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కొల్లి సాంబమూర్తి, వి.ఇందిర, కె.రామస్వామి, మర్రి శ్రీను, రెడ్డి ఈశ్వరరావు, కోరాడ ఈశ్వరరావు, సీతారాం, బి.సూరిబాబు, ఎస్.ఉమా, పి రాము, నిర్వాసితులు, పేదలు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు

ఆ సంక్షేమం, అభివృద్ధి మాకొద్దు

- మేం ఆంధ్రాతోనే ఉంటాం
- ఒడిశా అధికారులు, పోలీసుల దౌర్జన్యాలను భరించలేకున్నాం
- వారి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఇచ్చేస్తాం
- మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరకు స్పష్టం చేసిన కొటియా ప్రజలు

ప్రజాశక్తి-సాలూరు

ఒడిశా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమకొద్దని, తాము ఆంధ్రాలోనే ఉంటామని కొటియా గ్రామాల గిరిజనులు స్పష్టం చేశారు. సోమవారం గంజాయిభద్ర మాజీ సర్పంచ్ గెమ్మెల భీషు, పట్టుచెన్నూరు మాజీ ఎంపిటిసి చోడిపల్లి భీషు ఆధ్వర్యాన దూళిభద్ర, దిగువశెంబి, ఎగువశెంబి, దిగువ గంజాయిభద్ర, నేరెళ్ళవలస గ్రామాల గిరిజనులు మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొరను ఆయన నివాసంలో కలిశారు. ఒడిశా పోలీసులు, అధికారులతో అనుభవిస్తున్న ఇబ్బందులను వివరించారు. గత కొద్ది నెలలుగా ఒడిశా పోలీసులు, అధికారుల దౌర్జన్యాలకు, దురాగతాలకు విసిగి వేసారిన కొటియా గ్రామాల ప్రజలు ఇక భరించలేమని తెగేసి చెప్పారు. ఒడిశా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తాము తీసుకోబోమని, వారిచ్చిన రేషన్ కార్డులు ఇచ్చేస్తామని స్పష్టం చేశారు. చావైనా, రేవైనా ఆంధ్రాతోనే కలిసి ఉంటామని తేల్చిచెప్పారు. దొరలతాడివలసకు చెందిన పాస్టర్ ప్రసాద్ మాట్లాడుతూ కొటియా ప్రజలపై ఒడిశా పోలీసులు, అధికారుల దౌర్జన్యాలు శృతి మించుతున్నాయని, ఇక భరించే ఓపిక, సహనం తమకు లేవని చెప్పారు. ఎపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడమే ధ్యేయంగా ఒడిశా పోలీసులు, అధికారులు పని చేస్తున్నారని తెలిపారు. ఒడిశా ప్రభుత్వ అనుమతితోనే కేసులు నమోదు చేస్తున్నారని, ఆంధ్రా అధికారులు, పోలీసులకు తమను అడ్డుకునే దమ్ము లేదని ఎగతాళిగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దూళిభద్ర గ్రామానికి చెందిన గిరిజన నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తున్న తమను అన్యాయంగా ఒడిశా పోలీసులు తీసుకెళ్ళాలని, కొటియా, పొట్టంగి పోలీస్ స్టేషన్లకు తిప్పారని వాపోయారు. ఆంధ్రా వైపు వెళ్ళొద్దని పోలీసులు, అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. ఒడిశా పోలీసులు, అధికారుల ఆగడాలు భరించలేకనే తాము ఈ నిర్ణయానికి వచ్చామని తెలిపారు.

కొటియా గ్రామాల్లో మానవహక్కుల ఉల్లంఘన

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశా పోలీసులు, అధికారులు యథేచ్ఛగా మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర చెప్పారు. ఆ గ్రామాల గిరిజనుల సమస్యలను తెలుసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 జనవరి నెలలో అప్పటి టిడిపి ప్రభుత్వం కొటియా గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమం నిర్వహించిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఒడిశా ప్రభుత్వం దౌర్జన్యాలకు, దురాగతాలకు పాల్పడడం మొదలు పెట్టిందన్నారు. వైసిపి హయాంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి, అప్పటి ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్‌ని భువనేశ్వర్‌లో కలిసి కొటియా వివాదంపై చర్చించారని తెలిపారు. దీనిపై గనుల కోసం బేరమాడడానికి జగన్ వెళ్లారని టిడిపి నాయకులు విమర్శించారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో ఒడిశా పోలీసులు, అధికారుల దౌర్జన్యాలు మితిమీరాయని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి గాని, జిల్లా అధికారులు గాని ఒడిశా ఆగడాలపై స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రస్తుతం ఎపి, ఒడిశా రాష్ట్రాల్లో, కేంద్రంలో కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని, కొటియా గ్రామాల సమస్యకు పరిష్కారం చూపవచ్చునని చెప్పారు. కొటియా గ్రామాల గిరిజనుల నిర్ణయాన్ని కలెక్టర్, ఎస్‌పిలకు తెలియజేసి రక్షణ కల్పించాలని కోరుతామని రాజన్నదొర చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, మువ్వల ఆదియ్య పాల్గొన్నారు.

రాజన్నదొరకు వినతి అందిస్తున్న కొటియా గ్రామాల గిరిజనులు

కొండచీపుర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు

గిరిజన ఉత్పత్తులకు
గిట్టుబాటు ధర కల్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంత మార్కెట్ నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి గిరిజనులు ఉదయాన్నే సీతంపేట చేరుకున్నారు. వినూత్న రీతిలో కొండచీపుర్లు పట్టుకొని ర్యాలీ చేశారు. కొండచీపుర్లకు మార్కెట్ ధర కల్పించాలని, గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తవిటయ్య, తిరునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

జెఇఇలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

'ప్రతిభ'కు సత్కారం

ప్రజాశక్తి-పార్వతీపురం

జెఇఇ మెయిన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన గిరిజన గురుకులాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సన్మానించారు. జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబరచడం పట్ల కలెక్టర్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జాతీయస్థాయిలో 137, 900, 2,864వ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎస్.నందవర్ధన్ నిహాల్, ఎస్.అఖిల్, పి.జగదీశ్వరరావును సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని ఉద్బోధించారు. రాబోయే అడ్వాన్స్ పరీక్షల్లో కూడా మంచి ప్రతిభను కనబరిచి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జోగింపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.ధర్మారావు మాట్లాడుతూ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ విద్యార్థులకు రూ.40 వేలు ఖరీదు చేసే పుస్తకాలను ఉచితంగా అందించారన్నారు. దానివల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని, ఈ పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడమే కాకుండా అడ్వాన్స్ పరీక్షలకు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ విద్యార్థులందరూ అడ్వాన్స్ పరీక్షలలో కూడా తప్పక విజయం సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ● పిజిఆర్ఎస్‌కు 147 వినతులు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను, తమ స్వంత సమస్యగా భావించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, 48 గంటల్లోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కలెక్టర్ అధ్యక్షతన సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి 147 అర్జీలు అందాయి. ఆ వినతులను కలెక్టర్ స్వీకరించి, సమస్యలను సావధానంగా విని, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పునఃప్రారంభం కారాదని సూచించారు. జెసి ఎస్.ఎస్.శోబిక, డిఆర్ఒ కె.హేమలత, ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి భాగస్వామ్యమై అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు.

అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అర్జీలలో కొన్ని..

- 25 కుటుంబాలు నివాసం ఉండే గుమ్మలక్ష్మీపురం మండలం కొండభిన్నిడి గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక అత్యవసర పరిస్థితిలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని టి.చిన్నారావు, గ్రామస్తులు అర్జీని కలెక్టర్‌కు అందజేశారు. మూలభిన్నిడి నుంచి కొండభిన్నిడి వరకు 3 కిలోమీటర్ల మేర బిటి రోడ్డును మంజూరుచేయాలని కోరారు.
- కురుపాం మండలం పెదగొత్తిలిలో సచివాలయం, రైతు సేవా కేంద్రం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, ప్రస్తుతం పాత పంచాయతీ భవనం పాతబడటంతో వర్షానికి నీరు కారుతుందని, పరిపాలనకు ఆటంకం లేకుండా త్వరగా నిర్మాణపు పనులు చేపట్టి భవనాలు పూర్తి చేయాలని సర్పంచ్ టి.లోకనాథం వినతి అందించారు.
- పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలో జగన్నాథపురంలో పాత్రుడుగారి కోనేరును అభివృద్ధి చేసి, ప్రజలకు ఉపయోగ పడేలా చుట్టుపక్కల వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జగన్నాథ్ ప్రసాద్ రాయగురు, ఇతరులు కోరారు.
- మక్కువ మండలం బట్టివలస గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెం.94-2లో ఎకరా విస్తీర్ణంలో తాను గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న కొండ పోరంబోకు భూమిని కొందరు కబ్జా చేశారని ఎం.సన్యాసిదొర వినతి అందించారు. తన భూమిని రెవెన్యూ అధికారులతో సర్వే చేపట్టి, పాస్‌బుక్ మంజూరుతో పాటు ఆ భూమిని తనకు అప్పగించాలని వినతి అందజేశారు.
- బలిజిపేట మండలం నారాయణపురం గ్రామంలో సింహాద్రి నాయుడు అనే వ్యక్తి బలిజిపేట - పార్వతీపురం పబ్లిక్ రోడ్డుపై అడ్డుగా పూరిపాక వేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, వాహన దారులకు ప్రమాదాలు జరుగుతున్నాయని మజ్జి శ్రీరామ్మూర్తి ఫిర్యాదుచేశారు. రోడ్డుపై ఉన్న పూరిపాకను తొలగించుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్గీకరణలో 'రెల్లి'కి అన్యాయం

పార్వతీపురం రూరల్ : కులగణన చేయకుండా రెల్లి కులస్తులకు ఒక్క శాతం రిజర్వేషన్ కల్పించడం చాలా అన్యాయమని రెల్లి కులస్తుల సంక్షేమ సంఘం జెఎసి అధ్యక్షులు గండి డేనియల్ ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ తక్షణం నిలుపు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి అందించారు. కార్యక్రమంలో రెల్లి కుల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చిట్టిగెడ్డ ఆయకట్ట రైతులను ఆదుకోవాలి

పార్వతీపురం రూరల్ : తాళ్లబురిడి రెవెన్యూ పరిధిలో గెడ్డకు అనుకొని ఉన్న చిట్టిబట్టిపై చెక్‌డ్యామ్ నిర్మించి 300 ఎకరాలకు సాగునీరు అందించాలని ఆ గ్రామ రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి అందించారు. ఎక్కడికక్కడ చెక్‌డ్యాములు నిర్మించి, వృథాగా పోతున్న సాటిగెడ్డ నీటిని ఆయకట్ట రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు చెప్ప రామకృష్ణ, టి.నీలం నాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం రూరల్ : మక్కువ మండలం సీబిల్లి పెద్దవలస పంచాయతీ పరిధిలోని సీబిల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు దీసరి అప్పలస్వామి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న సర్పంచ్ రమణమ్మ భర్త పూడి తిరుపతిరావుపై చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి, కలెక్టర్‌కు వినతి సమర్పించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందిస్తూ సమస్య తన దృష్టిలో ఉందని చెప్పారు. వెంటనే మక్కువ తహశీల్దార్‌కి ఫోన్ చేసి పూడి తిరుపతిరావుపై చర్యలు తీసుకోవాలని, భూమిని మరల దీసరి అప్పలస్వామి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు పి. శ్రీనాయుడు, మోనంగి భాస్కరరావు, నాయకులు విశ్వేశ్వరరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

ఎస్‌పి మాధవ్‌రెడ్డి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఎస్‌పి ఎస్‌వి మాధవ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు అర్జీలు అందజేశారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్‌పి ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 14 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి ఎస్‌ఐ ఫకృద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవ్‌రెడ్డి

గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

పార్వతీపురం : రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్సీ ప్రకటించడంతో గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, వెంటనే గిరిజన ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్, నాయకులు సిహెచ్.సీతారాం, జె.బంగార్రాజు డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 3ని న్యాయస్థానం రద్దు చేయడంతో గిరిజన నిరుద్యోగ అభ్యర్థులకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. జిఒ3 రద్దు చేసి ఏళ్లు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణ ఆలోచనలు ప్రయత్నాలు చేయడం లేదని విమర్శించారు.

డిఎస్‌సిలో ఆదివాసీలకు మోసం

సీతంపేట : ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆదివాసీలను మోసం చేసిందని సీతంపేట ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆరోపించింది. సోమవారం స్థానిక విలేకరులతో జెఎసి నాయకులు మాట్లాడారు. ఇటీవల ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు ఎటువంటి మేలు కలగదని స్పష్టంచేశారు. దీన్ని వెంటనే ప్రభుత్వం పునరాలోచన చేసి, జిఒ 3 అమలుపరిచేలా చూడాలని డిమాండ్‌చేశారు.

ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని మోడల్ స్కూల్లో సోమవారం జరిగిన ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 240 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 199 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి తెలిపారు. ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఎగ్జామ్స్ సూపరింటెండెంట్ టి.శంకరావు పర్యవేక్షించారు.

ప్రవేశ పరీక్షకు 211 మంది హాజరు

భామిని : భామిని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి సోమవారం నిర్వహించిన పరీక్షకు 211 మంది హాజరయ్యారు. పరీక్షలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేటలో ఎమ్మెల్యే గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని కూటమి కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తాగునీరు, రహదారులు, సిసి రోడ్లు, పథకాలు వంటి సమస్యలపై వినతులు అందాయి. వెంటనే సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్‌లో కూటమి నాయకులు హెచ్.పవన్, ఎఎంసి చైర్‌పర్సన్ బిడ్డిక సంధ్యారాణి, మాజీ ఎంపిపి మాలయ్య, సోను తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని అప్పన్నపాలెం వద్ద గల జిందాల్ పరిశ్రమ యాజమాన్యం ప్రకటించిన అక్రమ లాక్‌అవుట్‌ను తక్షణమే ఎత్తివేసి 350 మంది కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు జిందాల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ప్రతినిధులు సోమవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని లక్కవరపుకోటలో గల ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 57 మంది పర్మినెంట్ కాగా 264 మంది కాంట్రాక్టు పద్ధతిలో సుదీర్ఘకాలంగా పరిశ్రమలో పనిచేస్తున్నారని, కనీసం ఏ విధమైన ముందస్తు నోటీసులు జారీ చేయకుండా, కనీసం ప్రభుత్వానికి సైతం తెలియజేయకుండా అర్ధాంతరంగా పరిశ్రమ మూసివేయడం సరికాదని యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఇటీవల జిల్లా డిసిఎల్ కార్యాలయంలో యాజమాన్యం, కార్మిక సంఘాలతో జరిపిన చర్చల్లో ఎసిఎల్ వారు లాకౌట్ చట్టవిరుద్ధమని పరిశ్రమను తక్షణమే తెరిచి కార్మికులకు పనులు కల్పించాలని, లేకుంటే పరిశ్రమ మూసి ఉన్నప్పటికీ పూర్తి వేతనాలు చెల్లించాలని తెలియజేశారన్నారు.

ఈ విషయాన్ని గుర్తించి పరిశ్రమ తెరిపించాలని లాకౌట్ కాలానికి వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని ఎమ్మెల్యేని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పిల్లా అప్పలరాజు, సలాది భీమయ్య, నమ్మి చినబాబు, ఈశ్వరరావు లగుడు వామాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొడుతున్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయ ఎఒ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఐసిడిఎస్, ఉపాధి, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు లేరా? అంటూ అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు.

హామీలను అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తొలుత కలెక్టరేట్‌కు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎ.గోపాలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో రావడానికి ఎన్నో వాగ్దానాలను చేసిందన్నారు. దాదాపు ఏడాది గడుస్తున్నా హామీల అమలుకు పూనుకోలేదని విమర్శించారు.

పని ప్రాంతంలో తాగునీరు ఉంచాలి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద వేతనదారులకు తాగునీటి సదుపాయం కల్పించాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎపిఒ పి.బావాజీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ పనులు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇసి మూర్తి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహాదేవివలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని మహాదేవివలస గ్రామంలో సోమవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వర పీడితులు, మధుమేహం, రక్తపోటు, తదితర రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నేచురల్ స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - డెంకాడ

స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఎపి సిఎన్ఎఫ్, సెర్ప్, డెంకాడ ఎఫ్‌పిఒ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ప్రదర్శనకు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రసాయనిక ద్రవ్యాలు లేకుండా పూర్తి స్వచ్ఛమైన, ప్రకృతి సిద్ధ పద్ధతుల్లో పండించిన వివిధ తైలు ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, మిగతా ఆహార పదార్థాలను ప్రదర్శనకు ఉంచారు. ప్రదర్శనలో ప్రకృతి సిద్ధంగా పండించిన బెండకాయ, దోసకాయ, కాకరకాయ, టమోటా, వంకాయ, మునగ ఆకులు, తోటకూర, చుక్కకూర వంటి కూరగాయలు, ఆకు కూరలు పెద్ద సంఖ్యలో ప్రదర్శించారు. వీటిని చూడటానికి వచ్చిన స్థానిక ప్రజలు వాటిపై మంచి ఆసక్తి చూపి, వాటిని కొనుగోలు చేశారు. పర్యావరణాన్ని రక్షించడంలో, మానవ ఆరోగ్యానికి మేలు చేకూర్చడంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాముఖ్యతను అధికారులు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, ఎఫ్‌పిఒ ఎపిఎం గురుమూర్తి, ఐసిఆర్‌పి సభ్యులు శ్రీదేవి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

డిఇఒ రమాజ్యోతి

ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థులతో డిఇఒ రమాజ్యోతి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రుల తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని రమాజ్యోతి కోరారు. శనివారం బాగువలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసర గ్రామాలలో చేపట్టిన ఎన్‌రోల్మెంట్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో చదివించడం వల్ల నాణ్యమైన విద్య బోధనలు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. గ్రామంలోనే స్థానికంగా చదవడం వల్ల ఉపాధ్యాయులు కూడా అందుబాటులో ఉండి విద్యార్థులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. గ్రామంలో 23 మంది విద్యార్థులను ఉన్నత పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. మంగళవారం కూడా ఈ విధమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, మిగతా పిల్లలను కూడా ఎన్రోల్ చేయాలని ఎంఇఒ వెంకటరావును ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె.రామునాయుడు, మాత్యేష్, లక్ష్మునాయుడు, గౌరీశంకర్, మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని పి.రావివలస గ్రామంలో ఎంఇఒ సామల సింహాచలం పర్యటించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో నమోదైన విద్యార్థుల వివరాలను అంగన్వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఒకటో తరగతికి ముగ్గురు విద్యార్థులు ఉన్నారని తెలుసుకొని, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను స్థానిక పాఠశాలలో చేర్పించేందుకు దరఖాస్తులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట నాయుడు, జోగయ్య, అంగన్వాడీ కార్యకర్త జయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని తలవరం గ్రామంలో సోమవారం అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలు వినూత్నమైన రీతిలో మోడల్ పాఠశాలలో చేరారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదివి పట్టా పొందిన విద్యార్థులు పాఠశాలలో చేరడంతో జ్ఞాన జ్యోతి డిఆర్‌పిలు అంగన్వాడీలకు అభినందనలు తెలిపారు. దశమంతపురం పాఠశాలలో అంగన్వాడీ కేంద్రం నుంచి విద్యార్థులు చేరారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం : బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎంఇఒ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో కూడా చిన్నారుల చేర్పించవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి చదువుకుని ఎమ్మెల్యే స్థాయికి వచ్చానని గుర్తుచేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా గతంలో తనకు చదువు చెప్పిన వారేనని ఈ సందర్భంగా తెలిపారు. 20 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్రావు, ఎంపిడిఒ సాల్మన్ రాజ్, తహశీల్దార్ శేఖర్, భద్రగిరి సిడిపిఒ రాజ్యలక్ష్మి, ఎంఇఒ-2 భీముడు, నాయకులు మర్రాపు పురుషోత్తం నాయుడు, పొట్నూరు వెంకట నాయుడు, దమయంతి, రాజేష్, మన్మథ పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ బాధ్యత

పంచాయతీ అధికారులదే

- కేటగిరీల వారీగా జాబితాలను సిద్ధం చేయండి
- వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండరాదు
- లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలి
- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

పంచాయతీ పరిధిలోని చెరువులు, ఇతర ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణ కాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తేల్చిచెప్పారు. రెవెన్యూ, సర్వే, పోలీస్ అధికారుల సమన్వయంతో జిల్లా పంచాయతీ అధికారి.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గ్రామ సచివాలయంలో వివిధ రకాల పింఛన్లు, ఇతర పథకాల కోసం అర్జీదారులు దరఖాస్తులను సమర్పిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అటువంటి దరఖాస్తుదారుల అర్హతలను క్షుణ్ణంగా పరిశీలించి జాబితాను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తక్షణమే ఆన్‌లైన్ నందు నమోదు చేసి, ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ వివరించారు. దీనిపై మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్.. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. సమస్యలు ఉన్నచోట తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ పత్రికల్లో వస్తున్న ప్రతికూల వార్తలపై ఆయా శాఖల అధికారులు వెంటనే స్పందించి, తీసుకున్న చర్యలపై డిపిఆర్ఒకు అందజేయాలన్నారు. పత్రికల్లో వార్తలు రాక ముందే సమస్యను గుర్తించి వాటికి తగిన పరిష్కారం చేయడం ఉత్తమమని కలెక్టర్ ఉద్బోధించారు.

ప్రభుత్వ శాఖల్లోని అధికారులు 2029 ముందస్తు ప్రణాళికలో సూచించిన విధంగా ఆయా శాఖల్లో నెల వారీ లక్ష్యాలను నిర్దేశించుకొని, అందుకు తగిన విధంగా ప్రగతిని కనబరచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా శాఖల వారీ ప్రగతి నివేదికలు సమర్పించాలని, వాటిపై సమీక్షిస్తామని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి టి.కనకదుర్గ, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్ పాల్, బి.శ్యామల, ఎస్.మన్మథరావు, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు బి.చంద్రశేఖర్, ఒ.ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఇ.అప్పన్న, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి డి.మంజుల వీణ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, డిఎల్‌డిఒ రమేష్ రామన్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి-బలిజిపేట

ప్రయివేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పేద పిల్లల ఉచిత విద్య కోసం ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని ఎంఇఒ సింహాచలం అన్నారు. సోమవారం ఎంఇఒ కార్యాలయంలో మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్స్‌తో ఈ అంశంపై సమావేశం నిర్వహించారు. అన్ని ప్రయివేటు యాజమాన్య పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లకు ప్రవేశాలు ఉచితంగా కల్పించాలని సూచించారు. 2025- 26 విద్యా సంవత్సరానికి ఈనెల 28 నుండి మే 15 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పసుకుడిలో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని పసుకుడి గ్రామంలో ముువ్వల జయరాం జ్ఞాపకార్థం సోమవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ నాయకులు బి.అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ టోర్నీలు 10 గ్రామాల జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ముువ్వల జయరాం తండ్రి అప్పలనాయుడు, గంట తిరుపతిరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి

అనుమతులు ఇప్పించాలని వినతి

పిఒతో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకినాయుడు, గ్రామస్తులు

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దోనుబాయిలో దుర్గమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణం కోసం అనుమతులు ఇప్పించాలని సర్పంచ్ కూరంగి వెంకినాయుడు ఆధ్వర్యాన గ్రామస్తులు గ్రీవెన్స్‌లో వినతి పత్రం సమర్పించారు. సోమవారం ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. దోనుబాయి గ్రామస్తుల వినతిపై స్పందించిన పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పివి ఈతమానుగూడ పంచాయతీకి భవనం నిర్మించాలని సర్పంచ్ పత్తిక వీరన్న విన్నవించారు. బామిని మండలం పసికిడి గ్రామానికి చెందిన పాలక కాంతమ్మ వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు. భామిని మండలం గజపతినగరం చెందిన కిశోర్ ఇంటి స్థలం మంజూరు చేయాలని పిఒ దృష్టికి తీసుకువచ్చారు. అంబలగండికి చెందిన కుశలయ్య సిసి రోడ్డు మంజూరు చేయాలని వినతి సమర్పించారు ఈ గ్రీవెన్స్ కు 44 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిడి అన్నదొర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, సుధారాణి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిఆర్‌డిఎ ఎపిడి సన్యాసిరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సత్యం, సిడిపిఒ రంగ లక్ష్మి, పిహెచ్ఒ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు మృతి

ప్రజాశక్తి - కురుపాం

మృతి చెందిన చేప పిల్లలను చూపిస్తున్న మత్స్యకారులు

డ్రెయినేజీ నీరు చెరువులో కలిసి వందలాది చేప పిల్లలు మృతి చెందిన సంఘటన కురుపాంలోని సంత కోనేరు చెరువులో సోమవారం చోటుచేసుకుంది. బాధిత మత్స్యకారుల కథనం ప్రకారం.. రూ.1.20 లక్షల పెట్టుబడితో సంతకోనేరు చెరువులో మత్స్యకారులు చేప పిల్లలను విడిచి పెట్టారు. తీరా చేతికి అంది వచ్చి ఎంతో కొంత లబ్ధి పొందుతామనే సమయంలో డ్రెయినేజీ నీరు చేరి, చెరువు కలుషితమై చేపలు మృతిచెందాయి. దీంతో మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. మత్స్య శాఖ స్పందించి నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

సమాచారం తెలుసుకున్న వెంటనే మేజర్ పంచాయతీ ఇఒ వై.వెంకట నాయుడు, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్ చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. చేపపిల్లలు మృతికి గల కారణాలను మత్సకారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టి డ్రెయినేజీ నీరు కలుషితం కాకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. సోమవారం గుమ్మలక్ష్మీపురం సమీపంలో ఉన్న మాలతమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ కాంట్రాక్టు ఉపాధ్యాయులు, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రితో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ ప్రతినిధి అమరాపు సూర్యనారాయణ, మహిళా అసోసియేట్ కర్రి రోజా రమణి, జిల్లా అధ్యక్షులు ఓలేటి తవిటినాయుడు, జిల్లా కార్యదర్శి కాగాన విజయ్, జిల్లా కౌన్సిలర్ జి.ప్రభాకర్ రావు, ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ జ్ఞాన ప్రకాష్, ఎంఇఒ బి.చంద్రశేఖర్, గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్ష కార్యదర్శులు సూర్య నారాయణ, ఎల్.హరి గోపాల్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని రస్తాకుంటు బాయిలోని కెవికెలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసలనాయుడును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా కురుపాం నియోజకవర్గానికి వచ్చి మాలతమ్మ తల్లిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

తిరుమలసాయి విద్యార్థులకు అభినందన

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలంలోని తిరుమలసాయి హైస్కూల్ నుంచి జవహర్ నవోదయకు ఎంపికైన 8 మంది విద్యార్థులను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రౌతు సరళ కుమారి, అకడమిక్ సలహాదారు రౌతు వెంకటరమణ, ప్రధానోధ్యాయులు సతివాడ శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభిందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

ముత్యాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

కురుపాం : మండలంలో గొటివాడలో ముత్యాలమ్మ తల్లిని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ, సాయి పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కూసిమిగూడలో వెయ్యి లీటర్ల బెల్లం ఊటను సోమవారం ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు సూర్యకుమారి, జైభీమ్, ఎస్ఐ కావ్య, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కురుపాం

వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో కురుపాం బస్టాండ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ పి. నారాయణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వాయుపుత్ర సేవ సంఘ సభ్యులు బోట్ అనిల్, కళింగ కోమటి జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త కొత్తకోట రవీంద్ర కుమార్, శ్రీనివాసరావు, గెంబలి ప్రదీప్ కిరణ్, విద్యాసాగర్, బోటు స్వాతి పాల్గొన్నారు.

సారా అమ్మకాలపై ప్రత్యేక దృష్టి

డిఎస్‌పి రాంబాబు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక దృష్టిసారించాలని డిఎస్‌పి రాంబాబు.. పోలీసు అధికారులను ఆదేశించారు. మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ ప్రాంతంలో నాటుసారా వంటకాలు, అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యువత ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తే మొదటి తప్పుగా తల్లిదండ్రులను పిలిపించి, వారికి ఎదురుగా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. మరలా తప్పు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. లైసెన్సులు, వాహన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలని సూచించారు. లైసెన్స్ లేని వారికి, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని చెప్పారు.

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు

కురుపాం : నీలకంఠాపురం పోలీస్‌స్టేషన్‌ను సోమవారం డిఎస్‌పి రాంబాబు సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సిడి ఫైల్స్, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి గ్రీవెన్స్ విభాగం గూర్చి అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, నేర విభాగంలో ముద్దాయిలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో సిఐ హరి, ఎస్ఐ నీలకంఠరావు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి రాంబాబు

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ర్యాలీ చేపడుతున్న అంగన్వాడీలు, ఐసిడిఎస్ అధికారులు

గర్భిణులు, బాలింతలు పోషక విలువలు ఉండే ఆహారం తీసుకోవాలని ఎంపిడిఒ జి.పైడితల్లి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఐసిడిఎస్ అధికారులు, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ వర్కర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపిడిఒ పైడితల్లి మాట్లాడారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి, ప్రధానోపాధ్యాయులు ఎస్ ఎల్ పాత్రుడు, గరుగుబిల్లి, రావివలస ఐసిడిఎస్ సెక్టార్ల సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి, అంగన్వాడీ వర్కర్లు ఎం.సావిత్రి, పల్ల కృష్ణవేణి, మహంతి పద్మావతి, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

భామిని : గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించే బాధ్యత అంగన్వాడీ సిబ్బందిపై ఉందని సిడిపిఒ శాంతిభవాని అన్నారు. బిల్లుమడ గ్రామంలో సిడిపిఒ ఆధ్వర్యంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభిన్న పోషకాలు కలిగి ఉండే ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, వాటిలో ఉండే పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి లక్ష్మి, బిపి సి వరలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.